నమస్తే తెలంగాణ
రాజన్న సిరిసిల్ల
5 | కరీంనగర్, శుక్రవారం 30 మే 2025 | RAJANNA SIRCILLA

**రోజుకు 200 లారీలపైనే..**

ఊటూరు గ్రామం నుంచి రోజుకు సుమారు 200 లారీలపైనే ఇసుకను తరలిస్తున్నాయి. వాగు నుంచి టిప్పర్ల ద్వారా బయటికి తెచ్చి ఇసుకను డంప్ చేస్తున్నారు. ఇక్కడి నుంచి లారీలను యంత్రాలతో నింపుతూ తరలిస్తున్నారు. 14 నుంచి 16 టైర్ల లారీల ద్వారా ఇసుకను హైదరాబాద్ దాని చుట్టు పక్కల ప్రాంతానికి తరలిస్తున్నారు. 14 టైర్ల లారీలో అయితే 32 మెట్రిక్ టన్నులు, 16 టైర్ల లారీలో అయితే 35 మెట్రిక్ టన్నుల ఇసుక లోడ్ చేస్తున్నట్లు టీజీ ఎండీసీ అధికారులు చెబుతున్నారు. నిజానికి ఇక్కడ వేయింగ్ చేసేందుకు వే బ్రిడ్జి ఉన్నా పని చేయడం లేదు. లారీలో ఓవర్ లోడ్ వేస్తున్నారని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో నామ మాత్రానికి ఇటీవలనే వే బ్రిడ్జ్ ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది.



ఊటూరు వద్ద రోడ్డుపై ఇసుక లారీలు నిలువడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న స్థానికులు

# లారీల హడల్.. రోడ్లన్నీ కరాబ్

- ఇసుక లారీల ఓవర్‌లోడ్‌తో దారులన్నీ గుంతలు
- ఊటూరు క్వారీ నుంచి రోడ్లకిరువైపులా పార్కింగ్
- దారిలేక స్థానిక ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు
- లారీల చక్రబంధనంలో పలు గ్రామాలు
- రాత్రి, పగలు తేడా లేకుండా హారన్ల మోత
- అడ్డుకోని అధికారులు.. వైబ్రేషన్‌కు గురవుతున్న రోడ్డు పక్క ఇండ్లు
- కూలిపోతే పరిస్థితి ఏమిటంటున్న గ్రామస్తులు
- నిత్యం వేలాది టన్నులుగా తరలుతున్న ఇసుక

**ఒకటా రెండా.. ఒకే సారి వందలాది లారీలు ఆ గ్రామాలను చుట్టుముడుతున్నాయి. హారన్ల మోతలతో హడలెత్తిస్తున్నాయి. లారీలు వెళ్లినపుడల్లా వైబ్రేషన్ వచ్చి రోడ్ల పక్క ఇండ్లు వణికిపోతున్నాయి. రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన రోడ్లు ఛిద్రమైపోతున్నాయి. మానకొండూర్ మండలం ఊటూరు, పచ్చునూర్, లలితాపూర్, అన్నారం, మానకొండూర్ గ్రామాల్లో నిత్యం కనిపిస్తున్న పరిస్థితి ఇది. ఊటూరు శివారులోని మానేరు వాగు నుంచి ప్రతి రోజు భారీ మొత్తంలో ఇసుకను తరలిస్తున్న వందలాది లారీలతో ఆయా గ్రామాల ప్రజలు బెంబేలెత్తుతున్నారు. తమ కోసం వేసిన రోడ్లు ధ్వంసమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.**



అన్నారం కల్వర్టు వద్ద ధ్వంసమైన రోడ్డు

### ఛిద్రమై పోతున్న గ్రామీణ రోడ్లు

కరీంనగర్ జిల్లా కేంద్రానికి 22 కిలో మీటర్ల దూరంలో ఉన్న ఊటూరు గ్రామాన్ని ఆనుకుని మానేరు వాగు ప్రవహిస్తున్నది. ఊరు చుట్టూ తిరుగుతూ ఈ వాగు వెళ్తుంది. కరీంనగర్ శివారులోని అల్గునూర్ మీదుగా మానకొండూర్ వరకు వరంగల్ రోడ్డులో ప్రయాణిస్తున్న ఇసుక లారీలు అక్కడి నుంచి మానకొండూర్ నుంచి జమ్మికుంట వరకు ఉన్న డబుల్ రోడ్డుపై పచ్చునూర్ వరకు ప్రయాణిస్తాయి. అక్కడి నుంచి 6 కిలో మీటర్ల దూరంలో ఉన్న ఊటూరుకు వేసిన సింగిల్ రోడ్డుపై ప్రయాణిస్తాయి. ఇసుక లారీల కారణంగా ఈ దారులన్నీ ఛిద్రమవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ముఖ్యంగా మానకొండూర్ నుంచి జమ్మికుంటకు వెళ్లే ప్రధాన దారిని ఇటీవలే నిర్మించారు. ఈ రోడ్డు ఇసుక లారీలు ఓవర్‌లోడ్‌తో ప్రయాణించడం వల్ల ఇప్పటికే అక్కడక్కడ గుంతలు ఏర్పడ్డాయి. కొత్తగా వేసిన ఈ రోడ్డుకు ఇంకా కొన్ని చోట్ల కల్వర్టులు నిర్మించాల్సి ఉంది. ఇలాంటి చోట్లనైతే రోడ్డు పరిస్థితి దారుణంగా తయారైంది. మోకాలు మంటి గుంతలు ఏర్పడ్డాయి. మానకొండూర్ మండల కేంద్రానికి సమీపంలో అన్నారం, పచ్చునూర్ వద్ద ఇలా రోడ్డు ఛిద్రమైన ప్రదేశాలు అనేక చోట్ల కనిపిస్తున్నాయి. ఎస్ఆర్ఎస్పీ కాలువపై నిర్మించిన చిన్న చిన్న కల్వర్టులు కూడా దెబ్బతింటున్నాయి. ఇక పచ్చునూర్ నుంచి ఊటూరు వెళ్లే దారిలో రెండు నెలల కిందనే రోడ్డు నిర్మించారు. బీటీతో నిర్మించిన ఈ రోడ్డు మట్టి రోడ్డుగా దర్శనమిస్తోంది. లారీలు ఎదురెదురుగా వచ్చినపుడు రోడ్డుకు ఇరు వైపులా భారీ గుంతలుపడి ప్రమాదకరంగా మారాయి.

### లారీల చక్రబంధనంలో గ్రామాలు

ఊటూరు నుంచి హైదరాబాద్ తదితర ప్రాంతాలకు ఇసుక తరలించేందుకు ప్రతి రోజు వందలాది లారీలు రాకపోకలు సాగిస్తున్నాయి. మానకొండూర్ మండలం అన్నారం మొదలు కొని పచ్చునూర్ వరకు ఉన్న డబుల్ రోడ్డుపై దారికి ఇరువైపులా ఎక్కడ బడితే అక్కడ విచ్చల విడిగా పార్కింగ్ చేస్తున్నారు. ఈ కారణంగా స్థానిక గ్రామాల ప్రజలు, కరీంనగర్ నుంచి జమ్మికుంటకు వెళ్లే బస్సులు, ఇతర వాహనాలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. రెండు వాహనాలు ఎదురెదురుగా వెళ్లలేని పరిస్థితిలో ఉన్న చిన్న కల్వర్టులపై ఇసుక లారీలు వెళ్లిపోయే వరకు ఇతర వాహనాల మరోవైపు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది. మరో పక్క పదుల సంఖ్యలో ఇసుక లారీలు ఒకేసారి భారీ ఇసుక లోడ్‌తో వస్తుంటే ఊటూరు, పచ్చునూర్, లలితాపూర్, అన్నారం, మానకొండూర్ గ్రామాల్లో రోడ్డు పక్కనున్న ఇండ్ల వారికి నిద్ర కరువవుతోంది. రాత్రి పగలు తేడా లేకుండా భారీ వాహనాల హారన్లతో గ్రామాలు హోరెత్తి పోతున్నాయి. ఊటూరు నుంచి ప్రధాన రహదారికి రావాలంటే ఇండ్ల మధ్య నుంచి లారీలు వెళ్లాల్సి ఉంటుంది. లారీలు వస్తున్న క్రమంలో తమ ఇండ్లు వైబ్రేషన్‌కు గురవుతున్నాయిని స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. అంతే కాకుండా దుమ్ముతో తమ ఇండ్లన్నీ నిండి పోతున్నాయని, రాత్రి వేళ హారన్లతో నిద్రకు దూరమవుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

కరీంనగర్, మే 29 (నమస్తే తెలంగాణ)/ మానకొండూర్ రూరల్ : మానకొండూర్ మండలం ఊటూరు శివారులో మూడు ఇసుక క్వారీలను టీజీ ఎండీసీ గుర్తించింది. ఇక్కడ మొత్తం మూడు క్వారీలను నిర్వహిస్తున్నారు. ఊటూరు విలేజ్-1 పరిధిలోని బ్లాక్-1, బ్లాక్-2 పేరిట ఒక చోట, ఊటూరు విలేజ్-2 పేరిట మరో క్వారీని అధికారికంగా నిర్వహిస్తున్నారు. అయితే, ఊటూరు విలేజ్-1లోని బ్లాక్-1లో, ఊటూరు విలేజ్ -2 పరిధిలో ఇప్పటికే ఇసుక నిలువలు నిండుకున్నాయి. ప్రస్తుతం బ్లాక్-2లో మాత్రమే ఇసుక నిలువలు ఉన్నాయి. ఇక్కడి ఇసుక కోసం నిత్యం వందలాది లారీలు హైదరాబాద్ దాని చుట్టుపక్కల నుంచి ఇక్కడికి వస్తున్నాయి. లారీలు ఇసుక క్వారీలకు వెళ్లేందుకు గ్రామం చుట్టూ పంట పొలాల నుంచి మట్టి రోడ్లను నిర్మించారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా.. నిత్యం వందలాది లారీలు నడవడం వల్ల రోడ్లు ఛిద్రమై పోతున్నాయి. మానకొండూర్ నుంచి మొదలుకుంటే ఊటూరు వరకు 16 కిలో మీటర్ల మేర ఎక్కడ చూసినా అడుగడుగునా ఇసుక లారీలే తారస పడుతుంటాయి. రోడ్లపై రొద పెడుతూ పరుగులు తీయడమో, రోడ్లకు ఇరువైపులా పార్కింగ్ చేసి పెట్టడమో జరుగుతోంది. దీంతో స్థానిక ప్రజలు రోడ్లపై ప్రయాణించాలంటే జంకి పోతున్నారు.

ఊటూరులో పంట పొలాల నుంచి ఇసుక రీచ్‌కు వేసిన రోడ్డు





పచ్చునూర్ వద్ద ధ్వంసమైన ఎస్ఆర్ఎస్పీ డీబీఎం కల్వర్టు



తమ రేకుల షెడ్డు వైబ్రేషన్‌కు గురవుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్న మానకొండూర్ మండలం ఊటూరుకు చెందిన వృద్ధ దంపతులు




మాట్లాడుతున్న జిల్లా పార్టీ అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు

# పాలనలో కాంగ్రెస్ ఫెయిల్

- ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం పోయింది
- స్థానిక ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలి
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు

మెట్‌పల్లి టౌన్, మే 29: అసెంబ్లీ ఎన్నికల్లో అడ్డగోలు హామీలు ఇచ్చి, మోసపూరిత మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు పాలనలో ఫెయిల్ అయిందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు తీవ్రంగా విమర్శించారు. గురువారం మెట్‌పల్లి పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వచ్చే స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికలకు బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధంగా ఉండాలని, గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరితమైన పాలన గురించి ప్రజలకు వివరించాలన్నారు. స్వలాభాల కోసం పార్టీలు మారే వారిని ఉపేక్షించేది లేదని, మళ్లీ వారిని పార్టీలోకి తీసుకునేది లేదని తేల్చిచెప్పారు. పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకం కోల్పోయిందన్నారు. ప్రజలు మళ్లీ బీఆర్ఎస్‌నే కోరుకుంటున్నారని చెప్పారు. కేసీఆర్ మరోసారి సీఎం కావాలని ఆకాంక్షిస్తున్నారని వివరించారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొంటూనే, పలు సూచనలు చేశారు. ఇక్కడ మాజీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రావు, మాజీ కౌన్సిలర్లు, మన్నేఖాన్, కిషోర్, గంగాధర్, నాయకులు ఓజ్జెల శ్రీనివాస్, ఎనుగుందుల శ్రీనివాస్‌గౌడ్, ఉజగిరి శ్రీనివాస్, భీనాతి సత్యం, జక్కం బాబు, గజం రవి, బర్ల రమేశ్, సామిడి రఘు, తేజ, ప్రవీణ్ పాల్గొన్నారు.

# రైతుల కన్నీళ్లు పట్టవా..?

- ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం ఎందుకు..?
- ఎక్కడా చూసినా వడ్ల కుప్పలే ఉన్నయి
- కాంటా పెట్టకపోతే కర్షకుల పక్షాన ఆందోళన చేస్తాం
- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

బోయినపల్లి రూరల్, మే 29: 'ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. తీవ్ర నిర్లక్ష్యం చేస్తోంది. కేంద్రాలకు వడ్లు తెచ్చి రోజులు గడుస్తున్నా కొనకపోవడంతో వరుస వర్షాలకు నీళ్లపాలైపోతున్నదని, రైతులు కన్నీటి పర్యంతమవుతున్నా సర్కారు పట్టనట్లు వ్యవహరించడం సరికాదని' చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరుగాలం శ్రమించి వేసిన పంటను కొంటారో.. కొనరో? సూటిగా చెప్పాలని ప్రశ్నించారు. పంటను అమ్ముకునేందుకు రైతులు నెల రోజులుగా ఎదురుచూస్తున్నా, ఇందిరమ్మ రాజ్యానికి ఇసుమంతైనా కనికరం కూడా లేదని మండిపడ్డారు. గురువారం బోయినపల్లి మండలం అనంతపల్లిలో స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. రేవంత్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి అన్నదాత శ్రమ ఆవిరైపోతున్నదని, రోడ్లపై ఎక్కడ చూసినా ధాన్యం రాశులే కనిపిస్తున్నాయని, ఏ రైతును కదిపినా కన్నీటి గాథలే వినిపిస్తున్నాయని మండిపడ్డారు. పంట కొనుగోలుపై సర్కారు మాటలు నీటిమూటలేనని విమర్శించారు. చివరిగింజ వరకు కొంటామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అదే అరిగిపోయిన రికార్డును పదేపదే వినిపిస్తున్నా, ఎక్కడా కొంటున్న దాఖలాలు లేవని ధ్వజమెత్తారు. రైతులకు మద్దతు ధర చెల్లించి ధాన్యం కొనుగోళ్లు చేపట్టకపోతే, అన్నదాతల ఆగ్రహాన్ని ప్రభుత్వం చవిచూడక తప్పదని, రైతుల తరపున తాము సైతం ఆందోళన చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

# పథకాల అమలులో ఇన్ని కొర్రీలా..?

- జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

రాయికల్, మే 29: కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల కోసం తీసుకొచ్చిన పథకాల అమలుకు అనేక కొర్రీలు పెట్టడం సరికాదని, షరతుల్లేకుండా వర్తింపజేయాలని జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత డిమాండ్ చేశారు. లబ్ధిదారుల సంఖ్యను కుదించేందుకే అనేక నిబంధనలు తెస్తున్నదని మండిపడ్డారు. గురువారం రాయికల్ పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో బీఆర్ఎస్ పట్టణ, మండల నాయకులతో కలిసి విలేకరులతో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న పథకాలు కేవలం ప్రజలను మభ్య పెట్టేలా ఉన్నాయని ఎద్దేవా చేశారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ స్థలం కేవలం అరగుంటకే పరిమితం చేయడం, ఒక్క అడుగు విస్తీర్ణం పెరిగినా బిల్లులు ఇవ్వబోమని చెప్పడం దురదృష్ట కరమన్నారు. అరగుంటలో ఇల్లుకడితే బంధువులు వచ్చిన సందర్భాల్లో మెదిలే స్థలం ఉండదని, నిర్మాణం స్థలం పెంచి తదనుగుణంగా రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లకు మూడు రంగులు వేసి కాంగ్రెస్ ప్రభుత్వమే కట్టించిందన్నట్లుగా ప్రచారం చేసుకుంటున్నారని దుయ్యబట్టారు. ఇత్తేసీ పొత్తు కూడిన చందంగా కాంగ్రెస్ పాలన ఉందని విమర్శించారు. నిరుద్యోగ యువత కోసం తెచ్చిన రాజీవ్ యువ వికాసం పథకం అమలులోనూ క్లారిటీ లేదని, ఓ వైపు సిబిల్ స్కోర్‌కు సంబంధం లేదంటూనే మరో వైపు అంతర్గతంగా చెక్ చేస్తూ రిజెక్ట్ చేస్తున్నారని మండిపడ్డారు. ఇంటర్వ్యూల పేరుతో కాలయాపన చేస్తూ యువతని ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు. పథకం అమలు దశల వారీగా ఉంటుందని చెబుతున్న సర్కారు, స్పష్టమైన విధి విధానాలు ప్రకటించాలని, అర్హులందరికీ సబ్సిడీ రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అనిల్, మండల అధ్యక్షులు బర్కం మల్లేష్, కో ఆర్డినేటర్ శ్రీధర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్‌లు రాణి సాయి కుమార్, ఉదయ శ్రీ, మైనార్టీ మండల అధ్యక్షులు చాంద్ పాషా, మాజీ ఎంపీటీసీలు నాగరాజు, రాజేందర్ గౌడ్, మాజీ కౌన్సిలర్ శ్రీరాముల సత్య నారాయణ, మహేందర్, నాయకులు గంగారం, ప్రశాంత్ రావు, సోహెల్, శ్రీను, గంగాధర్, రామచంద్రం పాల్గొన్నారు.

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



# ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై సమీక్ష

పాల్గొన్న మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల, పొన్నం

కలెక్టరేట్, మే 29: జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై కలెక్టరేట్ ఆడిటోరియంలో గురువారం ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ధాన్యం కొనుగోళ్లు, ఇందిరమ్మ ఇండ్లు, భూభారతి, వానాకాలం సాగుకు సన్నద్ధంపై జిల్లాలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఆయా శాఖలకు చెందిన పలువురు అధికారులతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా పలువురు ఎమ్మెల్యేలు ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక విధివిధానాల్లో కొన్ని మార్పులు చేయాలని సూచించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తులు చేసుకున్న వారిని ప్రభుత్వం రూపొందించిన యాప్ అనర్హులుగా గుర్తిస్తోందని, దీనిని సరిచేయాల్సిన అవసరముందన్నారు. కాగా, వేదికపై ఎమ్మెల్యేల నేమ్‌బోర్డుల ఏర్పాటులో వివక్ష పాటించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేల నేమ్‌బోర్డులు మాత్రమే ఏర్పాటు చేసి, మిగతా ఎమ్మెల్యేల పేర్లు లేకపోవడంపై ప్రోటోకాల్ విస్మరించారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, పెద్దపల్లి, రామగుండం, చొప్పదండి, జగిత్యాల ఎమ్మెల్యేలు విజయ రమణారావు, మక్కాన్‌సింగ్‌రాజ్ ఠాకూర్, మేడిపల్లి సత్యం, ఎం సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీలు మల్క కొమురయ్య, చిన్నమైల్ అంజిరెడ్డితోపాటు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లయ్య, కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల కలెక్టర్లు పమేలా సత్పతి, సత్యప్రసాద్, సందీప్‌కుమార్ ఝా, ఆయా జిల్లాల అదనపు కలెక్టర్లు లక్ష్మీ కిరణ్, జల్ద అరుణశ్రీ, డీఆర్‌వో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

లక్ష్మీపూర్‌లో నరికేసిన హరితహారంలో నాటిన చెట్లు



# సంరక్షించాల్సిన వ్యక్తే.. కొట్టేశాడు!

- లక్ష్మీపూర్‌లో హరితహారం చెట్ల నరికివేత
- మహిళా సంఘాల సీఏ శ్రీనివాస్ నిర్వాకం
- చర్యలు తీసుకుంటామన్న పంచాయతీ కార్యదర్శి

సిరిసిల్ల రూరల్, మే 29: ఏపుగా పెరిగి నీడనిస్తున్న హరితహారం వృక్షాలను సంరక్షించాల్సిన వ్యక్తే నరికివేసిన ఘటన సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం లక్ష్మీపూర్‌లో జరిగింది. వివరాల్లోకి వెళితే.. కేసీఆర్ సర్కార్ హయాంలో హరితహారంలో భాగంగా లక్ష్మీపూర్ గ్రామాన్ని పోలీసులు దత్తత తీసుకున్నారు. అప్పటి సీఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామంలోని సబ్‌స్టేషన్ సమీపంలో తంగళ్లపల్లి-లక్ష్మీపూర్ రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటించారు. అప్పటి నుంచి గ్రామ పంచాయతీ పాలకవర్గాలు ప్రత్యేక చొరవచూపడంతో మొక్కలు వృక్షాలుగా ఎదిగాయి. అయితే ఆ రోడ్డు వెంట గ్రామంలో మహిళా సంఘాల సీఏగా పనిచేస్తున్న శ్రీనివాస్‌కు వ్యవసాయ భూమి ఉంది. తన పొలానికి అడ్డుగా ఉన్నాయని చెట్లను గురువారం కొట్టేశాడు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి సంతోష్‌ను వివరణ కోరగా చెట్లు నరికివేసిన విషయం వాస్తవమేనని, తాను పరిశీలించినట్లు తెలిపారు. శ్రీనివాస్‌కు నోటీసులు ఇచ్చి, జరిమానా విధిస్తామన్నారు. పై అధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పాడు. కాగా, సీఏగా పనిచేస్తూ, హరితహారంలో నాటిన చెట్లను నరికివేసిన శ్రీనివాస్‌పై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.



పోలీస్ స్టేషన్‌లో దళిత బంధు సాధన సమితి సభ్యులు

# దళితుల ముందస్తు అరెస్ట్

హుజూరాబాద్ టౌన్, మే 29 : కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో హుజూరాబాద్ దళితబంధు సాధనసమితి సభ్యులను స్థానిక పోలీసులు గురువారం తెల్లవారుజామున అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా సాధనసమితి సభ్యులు మాట్లాడుతూ.. దళితుల అరెస్టులు అక్రమమని ఖండించారు. దరఖాస్తు ప్రక్రియల్లో నిమగ్నమై ఉన్నామని తెలిపినా పోలీసులు విడిచిపెట్టలేదని చెప్పారు. ప్రభుత్వం అరెస్టుల పేరుతో ఇబ్బందిపెడుతోందని మండిపడ్డారు. అరెస్టైన వారిలో అకినపల్లి ఆకాష్, శనిగరం రవీందర్, శనిగరం రాజు, శనిగరం సమ్మయ్య, శనిగరం బుచ్చయ్య ఉన్నారు.

# మట్టి కోసం కట్ట తవ్వి!

- మల్కపేట కెనాల్‌పై అక్రమార్కుల కన్ను
- కట్టకు ముప్పుతెచ్చేలా చర్యలు

ఎల్లారెడ్డిపేట, మే 29: వేలాది ఎకరాలకు సాగునీరందించే కెనాల్ కట్టపై ఉన్న మట్టిని రాత్రుళ్లు తరలిస్తూ కట్టకు ప్రమాదం తెస్తున్న ఘటన గురువారం వెలుగు చూసింది. రెండు రోజులుగా అర్ధరాత్రులు మట్టిని తొలగిస్తున్నారనే సమాచారంతో నీటి పారుదల శాఖ అధికారులు కిందిస్థాయి సిబ్బంది సుధాకర్‌ను అక్కడికి పంపించి మట్టిని తవ్వే పనులను నిలిపివేయించారు. కొద్దిసేపటికే అదే కట్టపై మరోచోట తవ్వకం మొదలు పెట్టగా సదరు ఫొటోలు 'నమస్తే'కు చిక్కడంతో తవ్వకాలు నిలిపివేసి అక్కడ నుంచి ఎస్కవేటర్, ట్రిప్పర్లను తీసుకెళ్లారు. దీనిపై 9వ ప్యాకేజీ డీఈ వెంకట్‌రెడ్డిని వివరణ కోరగా ఇది వరకు ఓసారి కట్టపై ఉన్న మట్టిని తీయవద్దని హెచ్చరించామని మరోమారు అదే పని చేస్తున్నారని మా సిబ్బంది సుధాకర్‌ను పంపించి మట్టితీత పనులను నిలిపివేశామని అన్నారు. కట్టకు ప్రమాదం తెచ్చే పనులను చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



కట్టపై ఉన్న మట్టిని తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

# కోరుట్లలో 'నవోదయ' ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్

కోరుట్ల, మే 29 : నిజామాబాద్, జగిత్యాల జిల్లాల్లో రెండు జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. జగిత్యాల జిల్లాలోని కోరుట్లలో నవోదయ పాఠశాలను ఏర్పాటు చేస్తూ శాశ్వత, తాత్కాలిక భవనాలకు సంబంధించి అవసరమైన చర్యలు ప్రారంభించాలని నవోదయ విద్యాలయ సమితి డిప్యూటీ కమిషనర్ గోపాలకృష్ణ గురువారం ఆదేశాలు జారీ చేశారు. కోరుట్ల పట్టణ శివారులోని జంబి గద్దె రోడ్డులో గల సర్వేనెంబర్ 923లో 30 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని నవోదయ పాఠశాలకు కేటాయించినట్లు పేర్కొన్నారు. నవోదయ పాఠశాల తాత్కాలిక వసతి భవనం కోసం పట్టణంలోని అల్లమయ్య గుట్ట బీఎస్సీ హానర్స్ అగ్రికల్చర్ కాలేజ్, సోషల్ వెల్ఫేర్ బాయ్స్ హాస్టల్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు. సంబంధిత అధికారులు, జిల్లా అధికారులతో సమన్వయం చేసుకుంటూ కోరుట్ల శివారులోని 30 ఎకరాల భూమి నవోదయ విద్యాలయ సమితి పేరుపై బదలాయింపునకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాల శాశ్వత, తాత్కాలిక భవనాల్లో రోడ్లు, నీరు, విద్యుత్, టెలీ కమ్యూనికేషన్, ప్రాథమిక సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచే నవోదయ పాఠశాల తాత్కాలిక భవనంలో ప్రారంభమయ్యేందుకు అవసరమైన మరమ్మతు పనుల స్థితిగతులపై నివేదిక అందజేయాలని జవహర్ నవోదయ విద్యాలయం కరీంనగర్ ప్రిన్సిపాల్‌కు డిప్యూటీ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.